క్లుప్తంగా

జిల్లా రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): సబ్ రిజిస్ట్రార్లు చేస్తున్న అవినీతిని కప్పిపుచ్చుతున్న జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావును సస్పెండ్ చేయాలని రాయలసీమ యువజన పోరాట సమితి అధ్యక్షుడు వీవీ నాయుడు డిమాండ్ చేశారు. శనివారం రాయలసీమ యువజన పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రసేని రియల్ ఎస్టేట్ సంస్థకు నగరంలోని విఠల్ నగర్‌లో 5847 సర్వే నంబర్‌లో 45 సెంట్ల స్థలం ఉందన్నారు. అందులో 2.75 సెంట్ల ప్రకారం 60 ఇళ్లకు ఎలా రిజిస్ట్రార్ చేస్తారని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ సంస్థ హంద్రీని ఆక్రమించి ఇళ్లను నిర్మించి విక్రయించుకోవడానికి కల్లూరు సబ్ రిజిస్ట్రార్ అధికారులు పూర్తిగా సహకరించారన్నారు. ఈవిషయంపై జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా నోటీసులిచ్చి చేతులు దులిపేసుకన్నారన్నారు.ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు వినోద్, మధుసూధన్‌నాయుడు, భాస్కర్, రాజశేఖర్, వసంత్, లక్ష్మణ్, సురేష్ పాల్గొన్నారు.

నేడు భావసార క్షత్రియ కుల విందు

కర్నూలు(అర్బన్): భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఈనెల 21న కుల విందు మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమాజ్ జిల్లా అధ్యక్షులు నీమ్‌కర్ శివశంకర్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆషాడ శుద్ధ తొలిఏకాదశి సందర్భంగా ఈనెల 17న రుక్మిణీ పాండురంగ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని భావసార్ భవన్‌లో నిర్వహించామని, ఈ నేపథ్యంలోనే కుల విందు మహోత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు. అదే రోజు 9.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌కు ఎన్‌ఏబీహెచ్ సర్టిఫికెట్



ఎన్‌ఏబీహెచ్ సర్టిఫికెట్‌తో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని కొత్తబస్టాండ్ వద్దనున్న జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌కు ప్రతిష్టాత్మకమైన ఎన్‌ఏబీహెచ్ సర్టిఫికెట్ లభించిందని హాస్పిటల్ సీఈవో డాక్టర్ ఎస్వీ చంద్రశేఖర్ చెప్పారు. ఆసుపత్రి ప్రారంభించిన 9 నెలలకే ఈ సర్టిఫికెట్ రావడం గర్వంగా ఉందన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ గుర్తింపు రోగులకు భద్రత, అధిక నాణ్యత గల ఆరోగ్య సంరక్షణ అందించడంలో ఉన్నత ప్రమాణాలు పాటించడం వల్ల వస్తుందన్నారు. కార్యక్రమంలో సీవోవో డాక్టర్ గణేష్, ఎన్‌ఏబీహెచ్ కో ఆర్డినేటర్ నదీమ్, డీజీఎం రమణ,అన్ని విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం సమన్వయకర్త హేమలత సూచించారు. శనివారం శరీన్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గట్టయ్యనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థులకు అతిసార వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం అతిసార వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన సూచనల వాల్ పోస్టర్‌ను వైద్యులు ఫర్వీన్ తబస్సుం, హెచ్‌ఎం ప్రేమలతతో కలిసి విడుదల చేశారు.

ఎస్పీతో టీడీపీ ఎమ్మెల్యేలు భేటీ

కర్నూలు: ఎస్పీ గరికపాటి బిందు మాధవ్‌ను ఆయన కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యేలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పాణ్యం, పత్తికొండ, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరితో పాటు టీడీపీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్ తదితరులు ఎస్పీని కలిసి పూలబొకే అందజేశారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



దేవనకొండ: పాలకుర్తి గ్రామానికి చెందిన వడ్ల సోమేశ్వర ఆచారి ఈనెల 16న ఆటో (ఏపీ39వీబీ 757)లో తెర్నేకల్ నుంచి గ్రామానికి ఎరువుల సంచులను తరలిస్తుండగా టైరు పేలి ఆటో పల్టీలు కొట్టింది. ప్రమాదంలో సోమేశ్వరాచారి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి క్షతగాత్రుడిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆధ్యాత్మిక జ్ఞాన మార్గదర్శి 'గురువు'

- నేడు గురుపౌర్ణమి (వ్యాస జయంతి)
- ముస్తాబైన సాయినాథుని ఆలయాలు
- ఆలయాల్లో కొనసాగుతున్న సాయి నామ అఖండ భజన
- వేడుకల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీలు



కర్నూలు కల్చరల్: మనిషి జ్ఞానవంతంగా ఎదిగేందుకు గురువు అవసరం. తొలి దశలో అమ్మ, ఆ తర్వాత నాన్న, అనంతరం ఉపాధ్యాయుడు. జ్ఞాన సాధన అనంతరం సమాజం గురువులుగా మనిషి ఉన్నతికి తోడ్పడతాయి. మానవ జీవితంలో గురువు పాత్ర విశేషమైంది. మనిషి శరీరానికి ఆహారం ఎంత అవసరమో వ్యక్తిత్వానికి జ్ఞానం అంతే అవసరం. ఆ జ్ఞానాన్ని ప్రసాదించే గురువుకు కృతజ్ఞతలు చెల్లించేందుకు గురుపూర్ణిమను మంచి అవకాశంగా భావిస్తారు. జీవితానికి మార్గనిర్దేశనం చేసి మంచి భవిష్యత్తును అందించినందుకు చదువు చెప్పే గురువుల పట్ల ఆరాధన భావంతో ఉంటారు.

ఆది గురువు వ్యాసుడే..

ఆది గురువు వేద వ్యాసుడు. ఆయన జయంతినే గురుపౌర్ణమి, వ్యాస పూర్ణిమగా కూడా వ్యవహరిస్తారు. వ్యాసుడు మానవ జాతికి ఆధ్యాత్మికతను వారసత్వంగా అందించాడు. ఆ వారసత్వాన్ని కొనసాగించేందుకు ఆయన పేరిట ప్రతి యేటా ఆషాడ శుద్ధ పౌర్ణమి నాడు వ్యాస (గురు) పూర్ణిమగా నిర్వహిస్తారు. వ్యాసుని పూర్వ నామం కృష్ణ ద్వైపాయనుడు. వేద కాలం నాటి సంస్కృతిని నాలుగు వేదాల్లో ఇమడ్చడంతో ఆయనను వేద వ్యాసుడుగా వ్యవహరిస్తారు.

గురుపూర్ణిమ రోజు ఇలా..



ఈ రోజున చాలా మంది భక్తులు ఉపవాసం ఉంటారు. సూర్యోదయం వేళ ఉపవాసం ఆరంభించి చంద్రోయద వేళకు ఉపవాసం ముగిస్తారు. చంద్రోదయాన్ని చూసిన తరువాత లేదా సాయంత్రం పూజలు ముగిసిన తర్వాత ఆహారాన్ని స్వీకరిస్తారు. ఆలయాల్లో నిర్వహించే పూజల్లో పాల్గొని సాయినాథుని దర్శించుకుంటారు. సమాజంలో మానవులు పుట్టినప్పటి నుంచి జీవితం ముగిసే వరకు గురువుతో విడదీయలేని బంధం ఉంటుంది. ఆధునిక కాలంలో ఆధ్యాత్మిక గురువులుగా కోట్లాది మంది షిరిడీ సాయిబాబాను, దత్తాత్రేయ స్వామిని ఆరాధిస్తారు. మనిషి ఆధ్యాత్మికంగా ఔన్నత్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్న గురువులందరికీ ఈ సందర్భంగా పూజలు నిర్వహిస్తారు.

సాయినాథుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గురుపూర్ణిమ రోజున జిల్లాలోని సాయిబాబా, దత్తాత్రేయుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆషాడ సుద్ధ పున్నమి రోజు నుంచి మూడు రోజుల పాటు ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కర్నూలు నగరంలోని దక్షిణ షిరిడి సాయిబాబా దేవస్థానంతోపాటు నగరంలోని 22 సాయిబాబా ఆలయాల్లో గురుపూర్ణి వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే శ్రీ సాయి జయ జయ సాయి అఖండ భజనను భక్తులు కొనసాగిస్తున్నారు. అన్ని ఆలయాల్లో అన్న ప్రసాద వితరణ చేయనున్నారు.

రాజకీయ వేధింపులు ఆపాలి



మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): స్కీం వర్కర్లు అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, వీఓఏ, వీఆర్ఏ, ఆర్‌పీలపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్కీం వర్కర్ల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, నాయకులు కె.వెంకటమ్మ, జే.నాగేశ్వరరావు, సుధాకరప్ప, బాలదుర్గమ్మ, కృష్ణవేణి, సువర్ణ, రాధిక, రజీయా, ఆశా శోభారాణి పాల్గొన్నారు.

66 మందికి ఉద్యోగాలు

కర్నూలు(సెంట్రల్): తమ కార్యాలయంలో శనివారం మినీ జాబ్‌మేళా నిర్వహించి 66 మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి తెలిపారు. జాబ్‌మేళాకు సంగీత్‌మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, నవత రో డ్డు ట్రాన్స్‌పోర్టు, ఫ్లిప్‌కార్టు, ఫ్యూజన్ మైక్రో ఫై నాన్స్ తదితర కంపెనీలు హాజరై తమ కావాల్సిన వారిని ఎంపిక చేసుకున్నట్లు వివరించారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జ్ గాజుల శ్వేతారెడ్డి



చిన్నారుల యోగాసనాలను తిలకిస్తున్న శ్వేతారెడ్డి

కర్నూలు (టౌన్): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోన్ ఇన్‌చార్జ్, 41వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి అన్నారు. ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యోగా టోర్నమెంట్ కం సెలక్షన్స్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్వేతారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలన్నారు. తద్వారా మంచి ఆరోగ్య జీవన విధానం అలవడుతుందన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ స్ఫూర్తితో ప్రపంచ వ్యాప్తంగా యోగాకు మంచి ఆదరణ లభించిందన్నారు. అనంతరం జాతీయ యోగా క్రీడాకారుల ఆసనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

- బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ నరేంద్ర



మహరాజా సయాజిరావ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా తమ బ్యాంక్ పని చేస్తోందని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎన్‌ఆర్‌పేట శాఖ చీఫ్ మేనేజర్ నరేంద్ర తెలిపారు. బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం ఫౌండర్ మహరాజా సయాజిరావ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి ఖాతాదారులకు పంచి పెట్టారు. చిన్మయ మిషన్ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం బ్యాంకు అందిస్తున్న వివిధ రుణ పథకాలను ఖాతాదారులకు వివరించారు. డిపాజిట్లపై 7.25 శాతం వడ్డీ ఇస్తున్నామని, గోల్డ్‌లోన్‌లపై 8.85 శాతం, గృహ రుణాలపై 8.40 శాతం నుంచి వడ్డీ రేట్లు ఉన్నాయని నరేంద్ర తెలిపారు. కార్యక్రమంలో కేఈ ప్లాజా బ్రాంచ్ మేనేజర్ సుబ్బరాయుడు, మాధవీనగర్ బ్రాంచ్ మేనేజర్ మాధవి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదులు రెండు రోజులు విధులకు దూరం

కర్నూలు (లీగల్): సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీసింగ్ (సీఓపీ) విషయంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఏపీ బార్ కౌన్సిల్ జారీ చేసిన సర్క్యులర్లను తక్షణమే రద్దు చేయాలని కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది. సీఓపీ అంశంపై న్యాయవాద సంఘం అత్యవసర సమావేశం జరిగింది. న్యాయవాద వృత్తికి విఘాతం కలిగించే సర్క్యులర్లను నిలుపుదల చేయాలని, అందులో భాగంగా ఈనెల 22, 23వ తేదీల్లో న్యాయవాదులు విధులను బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రవికాంత్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రవిగువేరా తెలిపారు.

మూడోరోజు ఇద్దరు నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న కార్పొరేటర్ అన్నెపోగు క్రాంతికుమార్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు శనివారం మూడోరోజు ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. 12వ వార్డు కార్పొరేటర్ అన్నెపోగు క్రాంతికుమార్ (వైఎస్సార్‌సీపీ), 39వ వార్డు కార్పొరేటర్ చెన్నబోయిన సాంబశివరావు తమ నామినేషన్లను నగరపాలక సంస్థలోని అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌కు అందజేశారు. నామినేషన్ల స్వీకరణ గడువు ఈనెల 24న మధ్యాహ్నం 3 గంటలకు ముగియనుంది.

పెరిగిన అనస్తీషియా టెక్నీషియన్ల ప్రాధాన్యత



కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): వైద్యరంగంలో అనస్తీషియా టెక్నీషియన్ల ప్రాధాన్యత పెరిగిందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. జాతీయ అనస్తీషియా టెక్నీషియన్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆసుపత్రిలోని క్యాజువాలిటీలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అనస్తీషియా టెక్నీషియన్లు రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రామశివనాయక్, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, అనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శారద, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, టెక్నీషియన్లు దినేష్, భాస్కరరెడ్డి, అనిల్, చిన్న పాల్గొన్నారు.

ఏడు నెలల శిశువుకు అరుదైన సర్జరీ



కోలుకున్న చిన్నారితో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): బెడ్‌పై నుంచి పడి తలకు తీవ్రమైన గాయం కావడంతో ఏడు నెలల శిశువుకు అరుదైన సర్జరీ చేసి ప్రాణం పోశారు కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్ వైద్యులు. వివరాలను శనివారం పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ టీమ్ వైద్యులు డాక్టర్ కేఎస్ విశ్వకుమార్, డాక్టర్ మురార్జీ వివరించారు. వివరాలు వారి మాటల్లోనే.. 'కర్నూలుకు చెందిన పరమేశ్వర అనే ఏడు నెలల చిన్నారి గత మే నెలలో ఇంట్లో బెడ్‌పై నుంచి కింద పడటంతో తలకు తీవ్ర గాయమై స్పృహకోల్పోయింది. వెంటనే కుటుంబసభ్యులు మెడికవర్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. సీటీ స్కాన్ తీయగా మెదడులో రక్తస్రావం ఉన్నట్లు గుర్తించాం. ఆ మేరకు మెదడులో రక్తస్రావాన్ని ఆపేందుకు శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించాం. నాలుగు రోజుల తర్వాత వెంటిలేటర్ తొలగించి చికిత్స కొనసాగించాం' అని వివరించారు. ప్రస్తుతం బాబు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సమావేశంలో మెడికవర్ హాస్పిటల్ కర్నూలు క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ బదిలీ

- గుంటూరు జేసీగా నియామకం



భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): కర్నూలు నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ బదిలీ అయ్యారు. ఆయనను గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ శనివారం రాత్రి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్‌ప్రసాద్ జీఓ జారీ చేశారు. 2022 ఏప్రిల్ 6న కర్నూలు మున్సిపల్ కమిషనర్‌గా బాధతలు చేపట్టిన ఆయన.. రెండేళ్లకు పైగా ఇక్కడ పనిచేశారు. కాగా ఆయన స్థానంలో ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి



పరిశుభ్రత పనులను పరిశీలిస్తున్న ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: హాస్టళ్లలో పరిశుభ్రతకు ప్రాధానత్య ఇవ్వాలని రాయలసీమ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అధికారులను ఆదేశించారు. వర్సిటీ హాస్టళ్ల పరిసరాల పరిశుభ్రత పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. హాస్టళ్లలో సౌకర్యాలను మెరుగు పరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం లైఫ్‌సైన్స్ విభాగాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులు, అధ్యాపకుల హాజరును తనిఖీ చేశారు. అధ్యాపకులు సమయపాలన పాటించాలన్నారు. అకడమిక్ క్యాలెండర్‌ను సక్రమంగా అనుసరించాలన్నారు. వర్సిటీలోని గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు సిటీ: వన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప కోరారు. శనివారం పసుపుల గ్రామంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని కలిసి కలిసి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రహిమాన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బహుభాషా వేత్త ఆచార్య కృష్ణమూర్తి



మాట్లాడుతున్న చంద్రశేఖర కల్కూర

కర్నూలు కల్చరల్: బహుభాషా వేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహితీ సదస్సు స్థాపకులు, ఉస్మానియా కళాశాల విశ్రాంత ఆచార్యులు ఎస్‌వీ కృష్ణమూర్తి అని గాడిచర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర అన్నారు. శనివరాం ఎస్‌వీ కృష్ణమూర్తి శత జయంతి ఉత్సవాన్ని స్థానిక ఉస్మానియా కళాశాలలో నిర్వహించారు. సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ జీవీ రమణయ్య, ఉస్మానియా కళాశాల పూర్వ ఆచార్యులు ఆచార్య జి.కృష్ణమూర్తి, తెలుగుభాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమిల్ మాట్లాడారు. వివిధ సాహిత్య అంశాల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ మండి అన్వర్ హుసేన్, ఎస్‌వీ కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



పనులు చేయిస్తున్న కటారి సురేష్‌కుమార్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని 23వ వార్డు శ్రీరామనగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. స్థానిక వైస్సార్‌సీపీ కార్పొరేటర్ కటారి పల్లవి, పార్టీ ఇన్‌చార్జ్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 60 లక్షలు జనరల్ ఫండ్ వెచ్చించి మురుగు కాల్వలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు.

• చినుకు పడితే చిత్తడే!



కృష్ణానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి కింద నిలిచిన వర్షం నీరు



దిన్నెదేవరపాడు రోడ్డుపై ఏర్పడిన గుంతలు

కల్లూరు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల కల్లూరు పరిధిలోని వివిధ కాలనీ రోడ్లు, వీధులు చిత్తడిగా మారాయి. కల్లూరు అర్బన్ 21వ వార్డు పరిధిలోని శ్రీనివాస నగర్ మురుగు కాలువలు లేకపోవడంతో వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోయింది. మహాలక్ష్మీనగర్‌లో సీసీ రోడ్లు లేకపోవడంతో రోడ్డు బురదమయంగా మారింది. కృష్ణానగర్ అండర్ రైల్వే బ్రిడ్జి కింద వర్షం నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దిన్నెదేవరపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతల మయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కేఎంసీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ వైద్య విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ 1996 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం కళాశాలలోని ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1996 బ్యాచ్ తరపున అనాటమి డిటెక్షన్ ల్యాబ్‌కు రూ.3.60 లక్షల విలువైన 5 ఏసీలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో వారికి విద్యనేర్పిన 25 మంది గురువులను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్‌రావు, డాక్టర్ మాలకొండయ్య, డాక్టర్ ప్రభాకర్‌రెడ్డితో పాటు పూర్వ విద్యార్థులు డాక్టర్ రాజయ్య, డాక్టర్ హరికిషన్, డాక్టర్ అయూబ్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.